క్లుప్తంగా

నేడు సీజ్ చేసిన బియ్యం వేలం

తెర్లాం: మండల కేంద్రంలోని ఎంఎల్ఎస్ పాయింట్ వద్ద శుక్రవారం ఉదయం 11 గంటలకు పౌర సరఫరా కేసుల్లో సీజ్ చేసిన 428 క్వింటాళ్ల బియ్యాన్ని వేలం వేయనున్నట్లు తహసీల్దార్ డోల రాజేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వేలంలో పాల్గొనదలచిన ఔత్సాహికులు రూ.2 వేలు ధరవత్తు చెల్లించాలని పేర్కొన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం వేలంపాట నిర్వహిస్తామన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రేగిడి: మండలంలోని ఉంగరాడమెట్ట వద్ద ఏపీ ఈపీడీసీఎల్ సబ్‌స్టేషన్ మరమ్మతుల దృష్ట్యా శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ట్రాన్స్‌కో డీఈఈ టీజీకే మూర్తి ఓ ప్రకటనలో గురువారం వెల్లడించారు. వినియోగదారులు ఈ అసౌకర్యాన్ని గుర్తించి, సహకరించాలని కోరారు.

వృద్ధాశ్రమ నిర్మాణానికి రూ.10 వేలు విరాళం



వృద్ధాశ్రమ నిర్మాణానికి రూ.10 వేల చెక్కు అందిస్తున్న దాతలు

రాజాం సిటీ: పట్టణ సమీపంలోని కొండంపేటలో వృద్ధాశ్రమ నిర్మాణానికి స్థానిక మల్లిఖార్జునకాలనీలో తాత్కాలిక వృద్ధాశ్రమ నిర్వాహకులకు దాతలు విరాళాలు అందజేశారు. గురువారం డోలపేటకు చెందిన కె.ఎస్.ఎన్. రాజు దంపతులు రూ.10 వేల చెక్కును నిర్వాహకుడు పి.శ్రీనివాస్‌కు అందించి, తమ ఔదార్యం చాటుకున్నారు. ఆశ్రమ నిర్మాణానికి మరింత మంది దాతలు ముందుకువచ్చి, సహాయ సహకారాలు అందించాలని కోరారు.

కేటీఆర్‌కు శ్రీరామనవమి పురస్కారం



కుదమ తిరుమలరావు

రాజాం: పట్టణానికి చెందిన రచయిత కేటీఆర్(కుదమ తిరుమల రావు) హైదరాబాద్‌కు చెందిన తెలుగు సాహిత్య జాతీయ వేదిక శ్రీరామనవమి పురస్కారానికి ఎంపికయ్యారు. గురువారం శ్రీరామనవమి సందర్భంగా నిర్వహించిన కవితల పోటీలకు రామమందిరం అనే కవితను తిరుమల రావు రచించి, పంపించారు. ఈ కవిత ఎంపిక కావడంతో సంస్థ అధ్యక్షుడు పక్కి రవిశేఖర సత్యనారాయణమూర్తి, ప్రధాన కార్యదర్శి మోటూరి నారాయణరావు కేటీఆర్‌కు అభినందనలు తెలిపి, కొరియర్‌లో పురస్కారాన్ని పంపిస్తున్నట్లు తెలిపారు.

నేడు సోషల్ ఆడిట్‌పై ప్రజావేదిక

రేగిడి: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి హామీ పథకం పనులకు సంబంధించి, చేపట్టిన సోషల్ ఆడిట్‌పై శుక్రవారం ప్రజావేదిక నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ జి.కాశీవిశ్వనాథరావు తెలిపారు. గత పదిరోజులుగా మండలంలో 2021–22 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి, జరిగిన ఉపాధి పనులు, ఖర్చు, అక్రమాలు, లోపాలపై చర్చించనున్నట్లు పేర్కొన్నారు.

చురుగ్గా పారిశుద్ధ్య పనులు



సారథి రోడ్డులో బ్లీచింగ్ చల్లుతున్న పారిశుద్ధ్య కార్మికుడు

రాజాం: పట్టణంలోని పలు వీధుల్లో గురువారం పారిశుద్ధ్య పనులు నిర్వహించారు. వీధులు, కాలువల్లో పేరుకుపోయిన చెత్తాచెదారం, ముగురు తొలగించి, బ్లీచింగ్ చల్లారు. ఠాణా వీధి, సారథి రోడ్డు, ఇందిరమ్మ కాలనీల్లో చేపట్టిన ఈ పనులను శానిటరీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ప్రసాద్ పర్యవేక్షించారు.

రంగప్ప చెరువు మరమ్మతులు చేపట్టరూ?

రాజాం సిటీ: మున్సిపాలిటీ పరిధిలోని సారథి గ్రామ సమీపంలోని రంగప్ప చెరువు మదుములకు మరమ్మతులు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు. చెరువు ఆక్రమణకు గురవడంతో పాటు ప్రస్తుతమున్న మదుములు కూడా పూర్తిగా పూడుకుపోయాయని వాపోయారు. దీంతో దిగువన ఉన్న ఆయకట్టు భూములకు ఖరీఫ్ సీజన్‌లో సక్రమంగా నీరందకపోవడంతో పంటలు పాడవుతున్నాయన్నారు. మదుముల పనులు చేపట్టేందుకు ఇప్పుడే అనుకూలంగా ఉంటుందని, అధికారులు చొరవ చూపాలన్నారు. ఇప్పటికైనా నీటిపారుదల శాఖ అధికారులు స్పందించి, చెరువు మదుములు ఏర్పాటు చేసి, పంటలకు సాగునీరు సక్రమంగా అందేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

జగదానంద కారక..
జయ జానకి ప్రాణ నాయక...

ధర్మాన్ని కాపాడేందుకు జీవితాన్ని త్యాగం చేసిన మహోన్నత ప్రజా పాలకుడు శ్రీరాముడు.. లోక కల్యాణం కోసం ఎన్నో కష్టాలను ఓర్చిన సీతారాముల పవిత్రబంధం అజరామరమైనది.. భవిష్యత్ తరాలకు ఆదర్శనీయమైనది. రఘువంశ రామయ్య చైత్ర శుద్ధ నవమి నాడు అయోధ్యలో జన్మించాడు. అనంతరం సీతాదేవిని వివాహమాడి.. తండ్రి ఆజ్ఞానుసారం పద్నాలుగు సంవత్సరాలు అరణ్యవాసం, రావణ సంహారం తర్వాత చైత్రశుద్ధ నవమి నాడే సీతా సమేతంగా అయోధ్యలో పట్టాభిషిక్తుడయ్యాడని భక్తుల నమ్మకం. అందుకే ప్రజలందరూ గురువారం నాడు శ్రీరామ నవమి వేడుకలు వాడవాడలా ఘనంగా జరుపుకున్నారు. అలాగే సీతారాముల కల్యాణం కూడా కనులపండువగా నిర్వహించారు. రామాలయాలు, మంటపాలను సుందరంగా అలంకరించి, వేకువజాము నుంచే పూజలు చేపట్టారు. బెల్లం, మిరియాలతో తయారుచేసిన పానకాన్ని భక్తులకు పంపిణీ చేశారు. ఉత్సవమూర్తుల ఊరేగింపులతో గ్రామాల్లో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.

– బొబ్బిలి/రాజాం నెట్‌వర్క్



తెర్లాం: నందబలగలో పూజలందుకుంటున్న సీతారాముల విగ్రహాలు



బొబ్బిలి రూరల్: పక్కిలో పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు



బాడంగి: చినభీమవరంలో సీతారాముల కల్యాణంలో పాల్గొన్న భక్తులు



రేగిడి: ఉంగరాడలో సీతారాముల కల్యాణం



రామభద్రపురం: శ్రీరాంనగర్‌కోలనీలో సీతారాముల కల్యాణం చేస్తున్న భక్తులు



రామభద్రపురం సాయిబాబా ఆలయంలో సీతారామ కల్యాణం చేస్తున్న ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు దంపతులు




బొబ్బిలి రూరల్: ముత్తాయవలసలో పట్టువస్త్రాలు తీసుకువస్తున్న సర్పంచ్ వసుంధర



రాజాం: సీతారాముల కల్యాణానికి సిద్ధం చేసిన తాళిబొట్టును చూపిస్తున్న అర్చకుడు



సంతకవిటి: ఆకట్టుకున్న మద్రాస్ మైత్రి సెంట్రల్ ఆర్ట్స్ బృందం నృత్య ప్రదర్శన



బొబ్బిలి: పట్టణంలోని తారకరామా కాలనీ లలితాదేవి ఆలయంలో భక్తులకు శతమానం చూపిస్తున్న అర్చకుడు



రాజాం: కోదండరామ ఆలయంలో పూజల్లో పాల్గొన్న భక్తులు



రాజాం సిటీ: పొనుగుటివలసలో సీతారాముల కల్యాణ ఘట్టం వివరిస్తున్న అర్చకులు



బొబ్బిలి రూరల్: పారాదిలో సీతారాములకల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు



వంగర: కొప్పరవలసలో సీతారాముల కల్యాణోత్సవానికి హాజరైన భక్తులు



మెంటాడ: జక్కువ రామమందిరంలో సీతారాములు కల్యాణం



రామభద్రపురం: కనిమెరక వీధిలో సీతారామ కల్యాణం చేస్తున్న భక్తులు



సంతకవిటి: గుల్లసీతారాంపురంలో సీతారాములకు పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కంబాల జోగులు



వంగర: కోనంగిపాడులో సీతారాముల కల్యాణోత్సవం తిలకిస్తున్న భక్తులు



తెర్లాం: ఎన్.బూర్జవలస రామాలయంలో జరిగిన సీతారాముల కల్యాణానికి హాజరైన భక్తులు



సంతకవిటి: గుల్లసీతారాంపురం ఆలయంలో సీతారాముల కల్యాణం చేస్తున్న వేదపండితులు

జోరుగా ప్లాంటేషన్

రేగిడి: మండలంలోని వన్నలి, అంబఖండి, వండాన పేట, చాటాయివలస గ్రామాల్లో జోరుగా ప్లాంటేషన్ కార్యక్రమం గురువారం నిర్వహించారు. చెరువు, సాగునీటి కాలువల గట్లపై కొబ్బరి మొక్కలు నాటారు. వీటిని కొంతమంది వేతనదారులకు దత్తత ఇచ్చి, భవిష్యత్‌లో ఫలసాయం పొందేలా చర్యలు తీసుకుంటున్నామని ఏపీఓ ఎస్.హరనాధరావు తెలిపారు. దాదాపు 200కు పైగా మొక్కలు నాటినట్లు ఆయన వెల్లడించారు.



వన్నలి గ్రామంలో మొక్కలు నాటుతున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

పాడి పశువుల పెంపునకు చర్యలు



బొత్సవానివలసలో పశువులకు గాలి కుంటు వ్యాధి నివారణ టీకాలు వేస్తున్న పశువైద్య సిబ్బంది

బాడంగి: మండలంలో పాడి పశువుల పెంపునకు ప్రభుత్వపరంగా ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు పశువైద్యాధికారి వి.గోవింద్ చెప్పారు. మండలంలోని బొత్సవానివలసలో గురువారం నిర్వహించిన వైద్యశిబిరంలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వైఎస్సార్ చేయూత ద్వారా మూడేళ్ల కాలంలో బ్యాంక్ లింకేజీ, స్వయంశక్తి సంఘాల ద్వారా సుమారు 500 పాడిపశువులు, మేకలు, గొర్రెల యూనిట్లు నెలకొల్పినట్లు చెప్పారు. వీటితో మండలంలో పాడి ఉత్పత్తిని కూడా గణనీయంగా పెంచినట్టు చెప్పారు. మండలంలో 13,400 పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయడాన్ని లక్ష్యంగా పెట్టుకోగా.. ఇంతవరకు 10,500 పశువులకు టీకాలు వేసినట్లు తెలిపారు.

మహిళల ఆర్థికాభివృద్ధే సీఎం లక్ష్యం

• ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు

రామభద్రపురం: మహిళల ఆర్థికాభివృద్ధే సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి లక్ష్యమని ఎంపీపీ చొకాపు లక్ష్మణరావు అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో శుక్రవారం నిర్వహించనున్న వైఎస్ఆర్ ఆసరా కార్యక్రమం ఏర్పాట్లను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, మండలంలోని 988 డ్వాక్రా గ్రూపులలో ఉన్న 10,490 మంది సభ్యులకు సుమారు ఐదు కోట్ల రూపాయల రుణమాఫీ జరిగిందన్నారు. ఇందుకు సంబంధించిన చెక్‌ను జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు మహిళలకు అందజేస్తారన్నారు. పరిశీలనలో మండల జేసీఎస్ చైర్మన్ చింతల సింహాచలంనాయుడు, డర్రు పైడిరాజు, పెద్దింటి కృష్ణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

రామతీర్థంలో పారిశుద్ధ్య పనులు



కల్యాణ మంటపం వద్ద పనులు చేస్తున్న కార్మికులు

నెల్లిమర్ల: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థంలో నిర్వహించిన శ్రీరామనవమి ఉత్సవాల్లో నెల్లిమర్ల నగర పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులు తమ సేవలందించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ బి. శ్రీనివాసరావు పర్యవేక్షణలో 12 మంది కార్మికులు బుధ, గురువారాల్లో పారిశుద్ధ్య పనులు చురుగ్గా చేపట్టారు. కల్యాణం నిర్వహించిన మంటపం ప్రాంగణం.. ఆలయ పరిసరాల్లోనూ శుభ్రం చేశారు. భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా చెత్తను ఎప్పటికప్పుడు తరలించారు.

కల్యాణ వ్యాఖ్యానకర్తకు సన్మానం



మైలవరపును సత్కరిస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

నెల్లిమర్ల రూరల్: రామతీర్థం పుణ్యక్షేత్రంలో గురువారం జరిగిన సీతారాముల కల్యాణ మహోత్సవంలో వ్యాఖ్యానకర్తగా వ్యవహరించిన మైలవరపు శ్రీనివాసరావును ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా దుస్సాలువాతో సత్కరించి 400 గ్రాముల వెండి పల్లెం బహుకరించారు. కార్యక్రమంలో అర్చకులు మల్లికార్జున శర్మ పాల్గొన్నారు.

పట్టణాభివృద్ధికి సహకరించాలి

రాజాం: పట్టణాభివృద్ధికి ప్రజలు, స్వచ్ఛంద సంస్థలు సహకరించాలని ఎమ్మెల్యే కంబాల జోగులు కోరారు. గురువారం పట్టణంలోని గొల్లవీధిలో రాజాం సెయింట్ ఆన్స్ హాస్పిటల్ సాయంతో తాగునీటి బోరు వేసేందుకు సంబంధించిన అనుమతి పత్రం ఎమ్మెల్యే అందజేశారు. వేసవి నేపథ్యంలో పట్టణంలో తాగునీటి ఇక్కట్లు లేకుండా చేసేందుకు తమవంతు సహకారం అందిస్తున్నామని దాతలు అన్నారు. అందరి సహకారంతో పట్టణం మరింత అభివృద్ధి చెందుతుందని ఎమ్మెల్యే అన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాజాం టౌన్ కన్వీనర్ పాలవలస శ్రీనివాసరావు, పార్టీ నాయకులు తోట తిరుమలరావు, పాపారావు, సెయింట్ ఆన్స్ ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.



తాగునీటి బోరు ఏర్పాటుకు సంబంధించి, అనుమతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే జోగులు

ఉల్లాసంగా గుర్రాల పరుగు పోటీలు

జామి: శ్రీరామ నవమి సందర్భంగా మండలంలోని గొడికొమ్ము గ్రామంలో రామాలయ ధర్మకర్త బొబ్బిలి రమణబాబు, సర్పంచ్ పిల్లల భవానీ, గ్రామపెద్దల ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన గుర్రాల పరుగు పోటీలు ఉల్లాసంగా సాగాయి. పోటీల్లో ఏడు గుర్రాలు పాల్గొనగా, విజయగనరం పెప్సీ రాజు గుర్రం మొదటి స్థానంలో, అలమండ సంత శ్రీనివాసరాజు గుర్రం ద్వితీయ స్థానంలో నిలిచాయి. విజేతలకు నిర్వాహకులు బహుమతులు అందజేశారు.



పోటీల్లో దౌడుతీస్తున్న గుర్రం

ఖాళీ పోస్టులను భర్తీ చేయాలి

విజయనగరం పూల్‌బాగ్: రాష్ట్ర వ్యాప్తంగా వివిధ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు హరీష్, రుద్ర ప్రసాద్ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక ఎల్‌బీజీ భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ, మెగా డీఎస్సీ విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు సతీష్, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శ్రీకారం



అభివృద్ధి పనులకు సంబంధించిన శిలాఫలకం ఆవిష్కరిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

విజయనగరం: శంకుస్థాపన వారోత్సవాల్లో భాగంగా నగరంలోని 28, 29, 30 డివిజన్లలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, తదితరులు గురువారం పర్యటించి వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి మాట్లాడుతూ, ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి కృషి చేస్తున్నారన్నారు. అందులో భాగంగానే శంకుస్థాపన వారోత్సవాలు పేరిట వారం రోజుల పాటు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుడుతున్నట్లు చెప్పారు. 28వ డివిజన్‌లో రూ. పది లక్షలు, 29వ డివిజన్‌లో రూ. ఆరు లక్షలు, 30 డివిజన్‌లో రూ. పదహారు లక్షలతో చేపట్టనున్న అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ఏప్రిల్ ఆరో తేదీ నుంచి పూర్తయిన పనులకు వారం రోజుల పాటు ప్రారంభ వారోత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రేవతీదేవి, జోనల్ ఇన్‌చార్జ్ కోలగట్ల కృష్ణారావు, యువజన నాయకులు ఈశ్వర్ కౌశిక్, డివిజన్ కార్పొరేటర్లు జకీర్ హుస్సేన్, పతివాడ గణపతిరావు, తదితరులు పాల్గొన్నారు.